# ముఖ్యమంత్రి కార్యాలయం

# తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 తేది: 13-08-2015

ఇందిరాసాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టుల కోసం ఇప్పటి వరకూ చేసిన పనులను ఉపయోగించుకుంటూనే ఖమ్మం జిల్లా సాగునీటి వ్యవస్థను మెరుగు పరచాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. ఖమ్మం జిల్లాలో ప్రస్తుతమున్న సాగునీటి అవకాశాలు, భవిష్యత్ లో చేయాల్సిన పనులపై గురువారం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కవిత, ఎమ్మెల్యేలు మదన్ లాల్, కనకయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జిల్లాలో అటవీ ప్రాంతం పోగా 13 లక్షల ఎకరాల భూమి సాగుకు అనుకూలంగా వుందని, అందులో ప్రస్తుతం ఐదారు లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతున్నదని ముఖ్యమంత్రి చెప్పారు. ఇందిరాసాగర్, రాజీవ్ సాగర్ పేర ఇప్పటికే రూ.1800 కోట్లతో పనులు చేసినా పెద్దగా సాగునీరు అందించింది లేదని సిఎం అన్నారు. జిల్లాలో ఇకపై సాగునీటి కోసం చేసే పనులు ప్రణాళికబద్ధంగా వుండాలన్నారు. ప్రస్తుతమున్న ప్రాజెక్టుల ద్వారా ఎంత వరకు సాగునీరు అందించవచ్చో అంచనా వేసి, మిగతా భూములకు ఏ మార్గం ద్వారా నీరు అందించాలనే అంశంపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. సాగునీటి సౌకర్యం లేని తిరుమలాయపాలెం, కూసుమంచి, ఖమ్మం రూరల్, ఖమ్మం అర్బన్, కామెపల్లి, కారేపల్లి, టేకులపల్లి, ఏలేరుపాడు, జూలూరుపాడు, ముల్కలపల్లి, అశ్వరావుపేట, దమ్మపేట, సత్తుపల్లి, తదితర మండలాలకు నీరు అందించే అంశంపై ఎక్కువ దృష్టి పెట్టాలని అన్నారు. పినపాక, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వరావుపేట, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాలకు గోదావరి నీటిని అందించేందుకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. కిన్నెరసాని ప్రాజెక్టును పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. గోదావరి ద్వారా ఎక్కువ ప్రాంతానికి సాగునీరు అందించే అవకాశాలున్నా, గతపాలకులు సరైన ప్రణాళిక లేకుండా వ్యవహరించడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని చెప్పారు. జిల్లా మధ్య భాగంలో వున్న ఇల్లెందు, వైరా, మధిర, ఖమ్మం నియోజకవర్గాలకు ఎక్కడి నుంచి నీరందించాలనే విషయంలో కూడా అధ్యయనం జరగాలన్నారు. అటు గోదావరి నది, ఇటు మంచి వర్షాలున్న ఖమ్మం జిల్లాలో ప్రతీ అంగుళానికి సాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు.

……………………………………………………………………………………………………………

సిపిఆర్ఓ టు సిఎం